క్లుప్తంగా

నవయుగ కవి చక్రవర్తి జాషువా



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగు సాహితీలోకంలో నవయుగ చక్రవర్తిగా కీర్తింపబడిన గొప్ప సాహితీవేత్త గుర్రం జాషువా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కవి కోకిల గుర్రం జాషువా జయంతిని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంపల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన కవితాప్రతిభతో తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి, విశ్వమానవుడు గుర్రం జాషువా అని కొనియాడారు. జాషువా ఆశయాలను, ఆలోచనలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాషువా చిరస్మరణీయుడు



భవానీపురం(విజయవాడపశ్చిమ): కవి జాషువా గొప్ప దేశ భక్తుడు.. అంతకుమించి జాతి యావత్తు గుర్తుంచుకునేలా రచనలు చేసిన మహోన్నత వ్యక్తి జాషువా చిరస్మరణీయుడని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ కొనియాడారు. కవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. మంచిని స్వీకరించి చెడును విసర్జించడం జాషువా వ్యక్తిత్వమన్నారు. ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ సమరసతా స్వరం..జాతీయ గళం పేరుతో జాషువా జయంతి నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు, సంస్కృతాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ ఆర్‌డీ విల్సన్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వి.సురేష్, బీజేపీ సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, రచయిత గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు. తొలుత బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, కిలారు దిలీప్, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, షేక్ బాజీ జాషువా చిత్రపటాన్ని ఊరేగించారు.

మైనార్టీ గురుకుల పాఠశాలను తరలించవద్దు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం ఐరన్‌యార్డ్‌లోని ఆంధ్రప్రదేశ్ గురుకుల మైనార్టీ బాలికల పాఠశాల వసతి గృహాన్ని తరలించవద్దని సీపీఎం ఫ్లోర్ లీడర్, పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్కూల్ వద్దకు వచ్చి ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవులు ఇచ్చి అటు పేరెంట్స్ కమిటీకి, ఇటు పేరెంట్స్‌కు తెలియపరచకుండా అర్థంతరంగా హడావుడిగా ఏలూరు జిల్లాకు మార్చడం నిబంధనలకు విరుద్ధమన్నారు విద్యా శాఖ మంత్రి లోకేష్ జోక్యం చేసుకుని బాలికలకు న్యాయం చేయాలని కోరారు. తల్లిదండ్రుల ఆందోళనకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమారస్వామి, వెంకటేశ్వరరావు, యశస్విని, శ్రీకాంత్, ఎండీ మస్తాన్, జి.వెంకట్రావు, రామారావు మద్దతు తెలిపారు.

దుర్గమ్మకు రూ.10 లక్షల విలువైన ఆభరణాలు అందజేత



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలువురు భక్తులు రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలను కానుకగా సమర్పించారు. మహారాష్ట్ర కోల్హాపూర్ ఎంపీ శ్రీకాంత్ షిండే కుటుంబం రూ.3.50 లక్షల విలువైన బంగారు హారాన్ని, హైదరాబాద్‌కు చెందిన రాజేష్, ప్రకృతి దంపతులు 60 గ్రాములతో రూ.6.50 లక్షల విలువైన బంగారపు పట్టీలను ఆలయ ఈఓ శీనానాయక్‌కు అందజేశారు. విజయవాడ గొల్లపూడికి చెందిన శ్రీమంజుష కుటుంబం ఉచిత ప్రసాద వితరణకు రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి వేద ఆశీర్వచనం అందించారు.



భక్త జన గిరి







ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం అమ్మవారు శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు, ఒడిశా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో భక్త జన కోలాహలం నెలకొంది. సాయంత్రం నిర్వహించిన నగరోత్సవం, కళాకారుల నృత్యాలు భక్తులను అలరించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







కూటమి పాలనలో అంతా అరాచకమే

- పశ్చిమంలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించిన వెలంపల్లి
- కూటమి 16 మాసాల పాలనలో ప్రజలకు చేసినది శూన్యం
- వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలు సైతం కొనసాగించలేని స్థితిలో ప్రభుత్వం
- చట్టానికి విరుద్ధంగా లోకేష్ ఆదేశాలను పాటించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం యావత్ అరాచక పాలనే కొనసాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు రూపొందించబడిన వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను వెలంపల్లి ఆదివారం తన కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 మాసాలవుతున్న ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలనూ సైతం అమలు చేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని చెప్పారు. దమ్ముంటే జగన్ హయాంలో చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై పోటీ పడాలన్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన హామీలను అమలుకు ప్రశ్నిస్తే రెడ్‌బుక్ పేరుతో నారా లోకేష్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూన్నారని దుయ్యబట్టారు. హైకోర్టు మొట్టికాయలు వేస్తున్నా పక్కన పెట్టి వైఎస్సార్ సీపీ శ్రేణులపై ఇష్టం వచ్చినట్లు తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు.

వ్యాపారస్తుల నుంచి వసూళ్లు..

నారా లోకేష్ ఆదేశాలను పాటిస్తూ ఆయన తొత్తులుగా పని చేస్తున్న అధికారులపై తాము అధికారంలోకి వచ్చిన తరువాత చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని వెలంపల్లి స్పష్టం చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో తమ పాలనలో ఇతర పార్టీల జెండా దిమ్మలను, గత ఎమ్మెల్యేల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల శిలాఫలకాలను ముట్టుకున్నా, తొలగించాలని, పగులగొట్టిన దాఖలాలు లేవన్నారు. గత ఎమ్మెల్యేల కన్నా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనీ, గతంలో కంటే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించాలని పోటీపడ్డామన్నారు. 2024 కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తమ పార్టీ జెండా దిమ్మలను పగలగొట్టారని, అభివృద్ధి శిలాఫలకాలు పగలగొట్టారని అనేక విధ్వంసం చేశారన్నారు. చాలామందిని కొట్టడం అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడం, వ్యాపారస్తులను చందాల రూపంలో కూటమి ప్రభుత్వం వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క వ్యాపారస్తుడు దగ్గరకి వెళ్లి డబ్బులు ఇవ్వకపోతే అధికారులు పంపిస్తాం, మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేసి వేధిస్తాం అని బెదిరిస్తున్నారన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా వేధింపులకు గురైన వారు ఆధారాలతో పొందుపరచాలని వారందరిపై తాము అధికారంలోకి వచ్చిన తరువాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శిరంశెట్టి పూర్ణ, ఆంజనేయరెడ్డి, పలు విభాగాల అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కొండపైకి మీడియా వాహనాలు నిలిపివేత

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కొండపైకి ఏర్పాటు చేసిన మీడియా వాహనాలను నిలిపివేయడంతో నడుచుకుంటూ వెళుతున్న వీడియో జర్నలిస్టులను అడ్డుకుని వారిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఓ శాటిలైట్ చానల్‌కు చెందిన వీడియో జర్నలిస్టు, మరో మహిళా జర్నలిస్టు కొండ పైకి వెళ్లేందుకు మోడల్ గెస్ట్ హౌస్ వద్దకు చేరుకున్నారు. అయితే భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో మీడియా కోసం ఏర్పాటు చేసిన కార్లను నిలిపివేసినట్లు తెలుసుకున్నారు. నడుచుకుంటూ ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి వెళ్లేందుకు సిద్ధమై టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు వీడియో జర్నలిస్టులను అడ్డుకోవడమే కాకుండా ఓమహిళా జర్నలిస్టు పట్ల దురుసుగా ప్రవర్తించారు. కలెక్టర్ జారీ చేసిన గుర్తింపు కార్డు చూపినా పోలీసుల తీరులో మార్పు రాకపోవడంతో వారు వెంటనే తోటి జర్నలిస్టులకు విషయాన్ని తెలియజేశారు. దీంతో జరిగిన విషయం తెలుసుకున్న కొండపై ఉన్న జర్నలిస్టులు వెంటనే ఆందోళనకు సిద్ధమయ్యారు. కొండపై నుంచి కిందకు దిగి మోడల్ గెస్ట్ హౌస్‌కు చేరుకుని కార్యాచరణ గురించి మాట్లాడుకున్నారు. అయితే ఈ సమయంలో కూడా పోలీసులు మీడియా పట్ల తమ వైఖరి ఏ విధంగా ఉందో తెలిపేలా డ్రోన్‌తో విజువల్స్ తీయడంపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వద్దకు వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, వెస్ట్ ఏసీపీ దుర్గారావు వచ్చి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో చివరకు నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు వచ్చి మరోమారు ఇటువంటి ఘటనలు జరగకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో జర్నలిస్టులు నిరసనను విరమించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి సవిత



అమ్మ సన్నిధిలో మంత్రి కందుల దుర్గేష్, కుటుంబ సభ్యులు

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రాష్ట్ర మంత్రి సవిత ఆదివారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి మంత్రి సవిత అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రికి ఆలయ అధికారుల స్వాగతం పలికారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి దుర్గేష్

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ఆధ్యాత్మిక, కళా, పర్యాటక, సాంస్కృతిక రంగాలకు పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకెళ్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

మహాచండీదేవి మనసాస్మరామి..



కుసుమహరనాథ ఆలయంలో వెలంపల్లి తదితరులు



పోతిన మహేష్‌ను సన్మానిస్తున్న గంగానమ్మ ఆలయ కమిటీ సభ్యులు

పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలు ఆలయాల్లో ఆదివారం అమ్మవార్లు మహాచండీదేవిగా, మహాలక్ష్మీదేవిగా, శ్రీ విష్ణుపాదోద్భవీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో పలు విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు, చండీహోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలకు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో రద్దీ నెలకొంది. మహాచండీదేవి మనసాస్మరామి అంటూ భక్తులు అమ్మవార్లను ప్రార్థించారు. ఆలయ అధికారులు, పందిళ్లలో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– వన్‌టౌన్/చిట్టినగర్/భవానీపురం(విజయవాడపశ్చిమ)




కొత్త అమ్మవారి సన్నిధిలో భక్తుల రద్దీ



సంతోషమాతగా మహాలక్ష్మి అమ్మవారు



గంగా, దుర్గా, మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో..




మహాలక్ష్మీదేవిగా భ్రమరాంబ మాత



చండీదేవిగా గంగానమ్మ అమ్మవారు



విష్ణు పాదోద్భవీదేవిగా పద్మావతి అమ్మవారు



భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో..



బాలాత్రిపుర సుందరీదేవిగా విజయదుర్గా అమ్మవారు



చండీదేవిగా గంగానమ్మవారు



శ్రీపంచాయతన శక్తి క్షేత్రం కనకదుర్గ ఆలయంలో..



ఊర్మిళానగర్‌లోని పోలేరమ్మ దేవస్థానంలో..



వసంత వేణుగోపాల స్వామి దేవస్థానంలో..

సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం రోజున మరింత అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. భక్తులకు ఎటువంటి లోపం లేకుండా వీఎంసీ తరఫున తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, చెప్పుల స్టాండ్లు, సామాన్లు భద్రపరచు ప్రదేశాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దసరా విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలా నక్షత్రం రోజున అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు. అందుకు 300 మంది అదనపు సిబ్బందికి విధులు కేటాయించాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు. సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేయాలని పేర్కొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం రద్దు

పటమట(విజయవాడతూర్పు): ప్రతి సోమవారం వీఎంసీలో నిర్వహించే ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమాన్ని దసరా శరనవరాత్రుల నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్–1, సత్యనారాయణపురంలోని సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నగర వాసులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.